

తంగిడి సంగమం

కృష్ణా, భీమా నదుల సంగమ స్థానం తంగిడి పాపాలు హరించే క్షేత్రంగా విరాజిల్లుతుంది.

వివరాలు 8లో ▸



రైతుబంధు వెనక్కి!

అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వం అందించిన రైతుబంధు నిధులు వెనక్కి వెళ్లాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.0 /19.3

వాతావరణం

ఉదయం శీతల గాలులు వీస్తాయి. రోజంతా వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం చూపిస్తుంది.

న్యూస్‌రీల్

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు రమేషాచారి, మధుసూధనాచారి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కొత్త, పాత వాహనాలకు పూజలు చేయించారు. భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు రవిచారి, నాగరాజుశర్మ, చంద్రశేఖర్‌రావు, అరవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హరికథ

ఆలయంలో అమావాస్య సందర్భంగా వెంకటేశ్వరస్వామి హరికథను రమణమూర్తి వినిపించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులను హరికథ ఎంతగానో ఆకట్టుకుంది. హార్మోనిస్టు తిమ్మప్ప, తబలిస్టు పురుషోత్తం, ఎర్రన్నగౌడ్, రంగస్వామి, కృష్ణ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు సముదాయం తరలించొద్దు

గద్వాల క్రైం: జిల్లా కోర్టు సముదాయాన్ని తరలించవద్దని గద్వాల బార్ అసోషియేషన్ సభ్యులు సోమవారం హై కోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నందకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ప్రస్తుతం కోర్టు సముదాయం కక్షిదారులు, న్యాయవాదులు తీవ్ర ఇబ్బందులకు గురై పరిస్థితి ఉందని వివరించారు. కోర్టు పక్కనే ఉన్న ఆర్డీఓ కార్యాలయ స్థలాన్ని కేటాయింపునకు అనుమతి ఇవ్వాల్సిందిగా కోరారు. నూతన కోర్టు సముదాయాన్ని గద్వాల మండలం పూడూరు శివారులోని చేనేత పార్క్ స్థలం కేటాయింపు ఇవ్వడం ఎంత మాత్రం సరైనది కాదని తెలిపారు. అనంతరం సమస్యలపై ప్రభుత్వానికి వివరించి అనువుగా ఉండే స్థలా కేటాయించేలా కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. శోభారాణి, రాఘురామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: నది అగ్రహారంలోని 132కేవీ గద్వాల సబ్ స్టేషన్‌లో ఉన్న 33కెవీ ఫీడర్లు మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్ బాబు తెలిపారు. మంగళవారం ఉదయం 7గంటల నుంచి 33కెవీ ఫీడర్ల పరిధిలో ఉన్న ఉప కేంద్రాలకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

అక్షరంలో అధమం

అక్షరాస్యతలో రాష్ట్రంలో 33వ స్థానంలో జిల్లా



- జిల్లాలో చదువుకున్న వారు 49శాతమే..
- నామమాత్రంగా అక్షరాస్యత పెంపు కార్యక్రమాలు
- డ్రాపౌట్స్ విద్యార్థుల సంఖ్య కూడా అధికం

గద్వాల రూరల్: ఒకప్పుడు కవులకు పుట్టినిల్లుగా ఉన్న గద్వాలకు విద్వత్ గద్వాలగా పేరుంది.. అదంతా గతం.. ప్రస్తుతానికి వచ్చే సరికి అభివృద్ధిలో మాత్రం ఇంకా వెనకబాటే. ఇందులో ప్రధానంగా అక్షరాస్యతలో రాష్ట్రంలోనే అట్టడుగు స్థానంలో నిలిచింది. ఇటీవల దేశ జనాభాకు సంబంధించి వెల్లడించిన వివరాల్లో అక్షరాస్యలో జిల్లా రాష్ట్రంలో 33వ స్థానం దక్కించుకుని ఆఖరున నిలించింది. ఓ వైపు అక్షరాస్యత పెంపు కోసం గత, ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వివిధ రకాల కార్యక్రమాలు లక్ష్యానికి దూరంగా నిలవడంతో వాటి ఫలితాలు కూడా అదే స్థాయిలో వెలువడి జిల్లా అట్టడుగు స్థానంలో నిలిచింది.

వలసలకు మారుపేరు

2016సంవత్సరానికి పూర్వం గద్వాల జిల్లా ఉమ్మడి పాలమూరు జిల్లా కింద ఉండేది. పాలమూరు జిల్లా అంటే దేశంలోనే లేబర్ జిల్లాగా పేరుంది. దీంతో ఈప్రాంతంలోని ప్రజలు అధిక శాతం పొట్ట చేత పట్టుకుని వలసలు వెళ్లే పరిస్థితులే గోచరిస్తాయి. గట్టు, కేటీదొడ్డి, ధరూరు, అయిజ, వడ్డేపల్లి, మానోపాడు, ఉండవెల్లి, రాజోళి, వడ్డేపల్లి వంటి ప్రాంతాలలో చాలా వరకు గ్రామాలు వలసల కారణంగా ఖాళీగా కనిపించేవి. ముఖ్యంగా గట్టు, కేటీదొడ్డి, ధరూరు, మల్దకల్ మండలాల్లో అయితే ఈ పరిస్థితి ఎక్కువగా ఉండేది. కానీ దివంతగ మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని జలయజ్ఞంలో భాగంగా నెట్టెంపాడు ప్రాజెక్టు వచ్చిన తరువాత పరిస్థితిలో కొంత వరకు మార్పు వచ్చింది. వలసలు తగ్గిపోయి చాలా వరకు ప్రజలు సొంత గ్రామాల్లోనే ఉంటూ తమ పిల్లలను పాఠశాలలకు పంపే పరిస్థితులు ఏర్పడ్డాయి.

2011 లెక్కల ప్రకారం 2,62,455 జిల్లా మొత్తం జనాభా 2,62,455. ఇందులో అక్షరాస్యత శాతం 49.87 మాత్రమే. అంటే మొత్తం జనాభాలో సగం మంది కూడా చదువుకున్న వారు లేరు. మొత్తం జనాభాలో పురుషుల సంఖ్య 1,59,704, మహిళల సంఖ్య 1,02,751. ఇందులో పురుషుల అక్ష్యరాస్యత శాతం 60.05 ఉండగా, మహిళల అక్ష్యరాస్యత శాతం 39.48 మాత్రమే ఉన్నారు. దీనికితోడు చదువు మధ్యలోనే మానివేస్తున్న విద్యార్థులు అధికంగా కనిపిస్తున్నారు. 2021-22 విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 703మంది విద్యార్థులు చదువు మధ్యలోనే మానేయగా అందులో 400 మందిని గుర్తించి 2022-23 విద్యాసంవత్సంరలో తిరిగి బడిలో చేర్పించారు. మిగతా 300 మంది విద్యార్థులకు సంబంధించిన ఆచూకీ ఆయా నివాస గ్రామాల్లో లభించలేదు. వారికి సంబంధించి 300 కుటుంబాలు స్థానికంగా ఉండకుండా వలస వెళ్లినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా ఈఎడాది అంటే 2022-23 విద్యా సంవత్సరంలో ఫిబ్రవరి నెల 20వ తేదీ వరకు 1050 మంది విద్యార్థులు చదువు మధ్యలో మానేసినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

49.87శాతం అక్ష్యరాసులు

ప్రత్యేక దృష్టి సారించాలి



అక్షరాస్యత పెంచాలంటే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి. ముఖ్యంగా గతంలో అమలు చేస్తున్నట్లు అనియత విద్యా బోధకులను ఏర్పాటు చేసి రాత్రి వేళలలో నిరక్షరాస్యులకు వారి ఇళ్ల వద్దనే చదువు నేర్పించాలి. ఇందుకోసం మహిళా సంఘాల సహకారం తీసుకుంటే మంచి ఫలితాలుంటాయి. గ్రామ స్వరాజ్యం అనే స్వచ్ఛంధ సంస్థను స్థాపించి ప్రజలను అక్షరాస్యులుగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10వేల నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నాము. – రాజుసాగర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, గట్టు

ప్రజల భాగస్వామ్యం అవసరం

జిల్లాలో అక్షరాస్యతను పెంచేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యం. ప్రభుత్వం పలురకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ చదువుకునేందుకు ప్రజలు, వారి పిల్లలు ఆసక్తి చూపడం లేదు. అందరూ కూడా విద్య ప్రాధాన్యత తెలుసుకుని ముందుకు వస్తే సంపూర్ణ అక్షరాస్యత సాధ్యపడుతుంది. – సిరాజుద్దీన్, డీఈఓ

అక్షరాస్యతలో వెనకబడ్డ మండలాల వివరాలిలా.. (2011లెక్కల ప్రకారం)

మండలం	జనాభా	మొత్తం అక్షరాస్యత శాతం	పురుషులు	మహిళలు
కేటీదొడ్డి	34,521	33.77	44.65	23.07
గట్టు	57,174	37.59	46.35	28.96
ధరూరు	47,227	41.08	51.87	30.28
మల్దకల్	52,579	41.79	52.50	30.84

ఆసియా ఖండంలోనే వెనకబాటు

గట్టు, కె.టి.దొడ్డి మండలాలు ఆసియా ఖండంలోనే అక్షరాస్యతో అట్టడుగున నిలిచాయి. కె.టి.దొడ్డి మండలం మొత్తం జనాభా 34,521 కాగా, ఇందులో అక్షరాస్యత శాతం 33.77 మంది మాత్రమే. గట్టు మండలం పూర్తి జనాభా 57,174 కాగా అక్షరాస్యత శాతం 37.59గా నమోదైంది. ఆ తరువాతి స్థానాల్లో ధరూరు మండలంలో మొత్తం జనాభా 47,227 కాగా మొత్తం అక్షరాస్యత శాతం 41.08, మల్దకల్ మండలం జనాభా 52,579 కాగా మొత్తం అక్షరాస్యత 41.79 శాతంగా ఉన్నారు.

‘ప్రజావాణి’కి 67 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ఖచ్చితంగా పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఫిర్యాదుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 67ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఇందులో 60 దరఖాస్తులు ధరణికి సంబంధించినవిగా, మిగిలినవి వివిధ రకాల సమస్యలపై వచ్చినట్లు తెలిపారు. వీటిని ఆయా శాఖలకు చెందిన అధికారులకు పంపినట్లు వాటిని ఖచ్చితంగా పరిష్కరించాలని, పరిష్కారం చూపని పక్షంలో అందుకు తగిన కారణాలు తెలియజేస్తూ సంబంధించి ఫిర్యాదుదారునికి అక్‌నాలెడ్జ్‌మెంట్‌ను పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్, ఆర్డీవో రాములు, కలెక్టరేట్ ఏవోలో యాదగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 10 అర్జీలు

గద్వాల క్రైం: జిల్లా పోలీసు కార్యలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 10 ఫిర్యాదులు అందాయి. వివిధ మండలలాకు చెందిన అర్జీదారులు పలు సమస్యలపై విన్నవించుకున్నారు. భూ వివిధ, కుటుంబ, ఆస్తీ తగదలపై ఎస్పీ సృజన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆమె వారితో మాట్లాడుతూ.. సివిల్ కేసులను కోర్టులో పరిష్కారం చేసుకోవాలని అన్నారు.

రాజీవ్ స్వగృహలో అభివృద్ధి పనులు చేపట్టాలి

గద్వాల రూరల్: రాజీవ్ స్వగృహ అంబర్ టౌన్ షిప్‌లో ప్లాట్ల అభివృద్ధి పనులు, మౌళిక సదుపాయలకు సంబంధించిన అంతర్గత రహదారులు, విద్యుత్ సౌకర్యం, మురుగు కాలువలు, తాగునీటి వసతి వంటి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సోమవారం తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. సమావేశంలో కలెక్టరేట్ ఏవోలు రాజు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

గట్టు : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని గద్వాల డీఎస్పీ రంగస్వామి స్థానిక పోలీసులకు ఆదేశించారు. సోమవారం గట్టు పోలీస్ స్టేషన్‌ను గద్వాల డీఎస్పీ రంగస్వామి, సీఐ చంద్రశేఖర్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను డీఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రంగస్వామి మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై స్పందించాలని, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి సంబంధాలను పోలీసులు ఏర్పరుచుకోవాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా పెట్టాలని, శాంతి భద్రతలకు భంగం కల్గించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని డీఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ పవన్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గట్టు పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రంగస్వామి

బాలికల రక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హేమలత

ఉండవెల్లి: బాలికల రక్షణ అందరి బాధ్యత అని జిల్లా బాలల రక్షణ భవన్ కోఆర్డినేటర్ హేమలత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు బాల్య వివాహాలపై, బాలల రక్షణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టాలపై ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎవరికైనా బాల్యవివాహాలు చేయాలని ప్రయత్నిస్తే వెంటనే చైల్డ్‌లైన్ టీం 1098కు సమాచారం అందించాలని, ఎలాంటి సమస్యలు వసతి గృహంలో ఉన్నా, ఇబ్బందులు తల్లెత్తున్న మాకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. బాలల హక్కులలో జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, బాగస్వామ్యపు హక్కులు ఉన్నాయని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో రవి , మైనార్టి గురుకుల ప్రిన్సిపల్ పద్మలత, తదితరులు పాల్గొన్నారు.

ఉట్కూరు లిఫ్ట్ పనులు పూర్తి చేయండి

అలంపూర్: ఉట్కూరు-1 ఎత్తిపోతల పథకం పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వెంటనే వాటిని పూర్తి చేయించేలా చూడాలని, అలాగే పనులు చేయకుండా నిలిపివేసిన కాంట్రాక్టర్‌ను తొలగించాలని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం ఇరిగేషన్ ఈఎన్సీని కోరారు. హైదరబాదులోని ఎర్రమంజిల్‌లో ఇరిగేషన్ ఈఎన్సీ మురళిధర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం సోమవారం కలిసినట్లు తెలిపారు. ఉట్కూరు-1 ఎత్తిపోతల పథకం పనులు అసంపూర్తిగా ఉన్నట్లు పేర్కొన్నారు. పనులు చేయకుండా ఉన్న కాంట్రాక్టర్‌ను తొలగించి మిగిలిన పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లింగనవాయి ఎత్తిపోతల పథకం కోసం హైడ్రోలజీకల్ క్లియరెన్స్ అనుమతులు ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు. సానుకులంగా స్పందించిన ఈఎన్సీ ఉట్కూరు-1 ఎత్తిపోతల పథకం పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ రవీందర్‌రావును కలిసి ఇటిక్యాల మండలంలోని 44వ జాతీయ రహదారి నుంచి ఇటిక్యాల వరకు మిగిలిన రోడ్డు పనులు, ఆర్.గార్లపాడు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. అయిజ-రాజాపురం-మేడికొండ అసంపూర్తిగా మిగిలిన రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఈఎన్సీని కోరినట్లు పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులు త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని ఈఎన్సీ హామీ ఇచ్చినట్లు తెలిపారు.



ఇరిగేషన్ ఈఎన్సీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

టెంపుల్ టూరిజం కేరాఫ్ మన్యంకొండ

- పేదల తిరుపతికి అధునాతన హంగులు
- తెలంగాణలో తొలి రోప్‌వే..
- త్వరలో టెండర్లు ఖరారు, వెంటనే పనులు ప్రారంభం
- చెరువు సుందరీకరణతో పాటు బోటింగ్‌కు ఏర్పాట్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పేదల తిరుపతిగా ప్రసిద్ధికెక్కిన జిల్లాలోని మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం అధునాతన హంగులు అద్దుకుంటోంది. భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదం పంచేలా రూపుదిద్దుకుంటోంది. టెంపుల్ టూరిజానికి చిరునామాగా మన్యంకొండ నిలిచేలా పలు అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి కృషితో ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేయగా.. ఆలయానికి మరిన్ని సొబగులు సమకూరనున్నాయి. రోప్‌వేతో పాటు వసతి గృహాలు, హరిత రెస్టారెంట్, దశావతారాల వంటి నిర్మాణ పనులు త్వరలో మొదలుకానున్నాయి. అదేవిధంగా దివ్యక్షేత్రం వేదికగా పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచేలా ప్రతి ఏటా ఉచితంగా సామూహిక వివాహాలు జరిపించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. శాంతానారాయణగౌడ్, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్టుల ఆధ్వర్యంలో వధూవరులకు పుస్తె మెట్టెల నుంచి పట్టువస్త్రాల వరకు అన్ని సమకూర్చనున్నట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. దశలవారీగా మన్యంకొండ ప్రత్యేకశోభను సంతరించుకుంటుండడంతో భక్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రస్తుతం జరుగుతున్న పనులు

❒ అమ్మవారి ఆలయం వద్ద రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన ఏసీ కల్యాణ మండపం పనులు చివరి దశలో ఉన్నాయి.

❒ నర్సింహస్వామి ఆలయం వద్ద రూ.40 లక్షలతో చేపట్టిన రెండు షెడ్ల నిర్మాణాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

❒ రూ.25కోట్ల వ్యయంతో అన్నదాన సత్రం, రూ.5కోట్లతో ప్రసాదం కౌంటర్లు నిర్మిస్తున్నారు.

❒ రూ.15కోట్లతో కన్వెన్షన్ సెంటర్, బడ్జెట్ హోటల్, రోప్ వే పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

❒ 20 గదులతో మరో వసతి గృహ నిర్మాణం చేపట్టనున్నారు.

పర్యాటక హబ్‌గా జిల్లా..

మహబూబ్‌నగర్ జిల్లాకు కేసీఆర్ ఎకో అర్బన్ పార్కు, పిల్లలమర్రి తలమానికంగా నిలుస్తున్నాయి. దీనికి 17 కిలోమీటర్ల దూరంలో రాయచూర్ మార్గంలో ఉన్న మన్యంకొండను కలుపుతూ టూరిజం శాఖ ఇప్పటికే ప్రతి ఆదివారం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసింది. పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.150 చార్జీ వసూలు చేస్తున్నారు. ఇందులోనే ఉచిత భోజనం, దర్శన సదుపాయం కల్పించారు. మరోవైపు క్లాక్‌టవర్ పనులు పూర్తి కాగా.. శిల్పారామం పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో పాటు మన్యంకొండలో రోప్‌వే, పెద్ద చెరువు ట్యాంక్‌బండ్ సుందరీకరణ, సస్పెన్షన్ బ్రిడ్జి పనులు పూర్తయితే మహబూబ్‌నగర్ పర్యాటక హబ్‌గా మారనుంది.

అయితే తెలుగు రాష్ట్రాల్లో తొలి రోప్‌వే..

తెలుగు రాష్ట్రాల్లోనే మొట్టమొదటి పెద్ద రోప్‌వేను మన్యంకొండలో ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన నిధులు విడుదల కాగా..త్వరలో టెండర్లు ఖరారు చేయనున్నారు. ఆ వెంటనే రోప్‌వేకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి. తేరు మైదానం నుంచి ఆలయం వరకు రోప్‌వే ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అదేవిధంగా మన్యంకొండ వద్ద ఉన్న చెరువుని సుందరీకరించి బోటింగ్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేసే దిశగా ముందుకుసాగుతున్నారు. ఈ మేరకు పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు భావిస్తున్నారు. ఇందుకనుగుణంగా ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు వెల్లడించారు.

ఏర్పాటు చేసినవి..

❒ నీటి సమస్య తీర్చేందుకు కొండపై మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.

❒ లక్ష్మీనర్సింహ స్వామి (ఓబులేశ్వర స్వామి) ఆలయాన్ని రూ.70లక్షలతో పునరుద్ధరించారు.

❒ ధ్వజస్తంభం, ఆర్చిగేటుతో పాటు సుందరీకరణ పనులు పూర్తి చేశారు.

❒ భక్తుల కోసం రూ.1.80 కోట్లతో పేరు మైదానంలో నిర్మించిన 18 వసతి గృహాలను ఇటీవల ప్రారంభించారు.

❒ భక్తులకు నీడ కోసం అమ్మవారి ఆలయం వద్ద రూ.40లక్షలతో చేపట్టిన రెండు షెడ్ల నిర్మాణాలు పూర్తి కాగా.. ఇటీవల ప్రారంభించారు.

❒ రూ.కోటి వ్యయంతో కొండ దిగువన అలివేలు మంగ ఆలయ కోనేరు, ఎగువన హనుమద్దాసుల కోనేరు వద్ద ఆహ్లాదం అందించేలా రెండు పార్కులు ఏర్పాటు చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఉండవెల్లి: విద్యార్థులకు నాణ్యమైన అందించాలని మహబూబ్‌నగర్ మైనార్టీ గురుకుల విజిలెన్స్ అధికారి జమీర్ ఖాన్ అన్నారు. సోమవారం మండలంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను వారు సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని, పలు రికార్డులను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వా రు పేర్కొన్నారు. బియ్యం, భోజనం, నీటి వసతి, గ దులు, పరిసరాలను ప్రతి నెల పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మలత తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లి మైనార్టీ గురుకుల పాఠశాల నీటి ట్యాంకును పరిశీలిస్తున్న అధికారులు

హాథ్ సే హాథ్ జోడో యాత్రకు ఇన్‌చార్జ్‌ల నియామకం

సాక్షి, నాగర్‌కర్నూల్: టీపీసీసీ చేపట్టిన ‘హాథ్ సే హాథ్ జోడో అభియాన్’ పాదయాత్రకు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లుగా టీపీసీసీ జనరల్ సెక్రటరీలను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ పి.కైలాశ్‌నేత, కల్వకుర్తి, షాద్‌నగర్‌లకు బీర్ల ఐలయ్య, కొడంగల్, దేవరకద్రలకు వీర్లపల్లి శంకర్, నారాయణపేట, మక్తల్‌కు ఎం.వేణుగౌడ్, వనపర్తి, జడ్చర్లకు పారిజాత నర్సింహారెడ్డి, గద్వాల, అలంపూర్‌లకు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, నాగర్‌కర్నూల్, అచ్చంపేటలకు చరణ్ కౌశిక్‌యాదవ్, కొల్లాపూర్ నియోజకవర్గానికి ఎస్.ఇందిరను నియమించారు. అలాగే ఉమ్మడి జిల్లా నుంచి టీపీసీసీ జనరల్ సెక్రటరీలుగా ఉన్న జనుంపల్లి అనిరుధ్‌రెడ్డిని నిర్మల్, ముదోల్ నియోజకవర్గాలకు, ఆర్.అభిలాష్‌రావును కుత్బుల్లాపూర్, ఉప్పల్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లుగా నియమించింది. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేతలు జి.చిన్నారెడ్డి, ఎ.సంపత్‌కుమార్, సి.వంశీచంద్‌రెడ్డి, మల్లు రవి ఏఐసీసీ ఎలక్టడ్ మెంబర్లుగా ఎంపికయ్యారు.

పాప హరణం.. తంగిడి సంగమం


కృష్ణా, భీమా నదులు కలిసే సంఘమ క్షేత్రం

- శ్రీపాద వల్లభుడు స్నానమాచరించిన క్షేత్రంగా గుర్తింపు
- పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు

కృష్ణా: నారాయణపేట జిల్లా కృష్ణా మండలం తంగిడి వద్ద ఉన్న కృష్ణా, భీమా నదుల సంఘమం ఓ విశిష్ట పుణ్యక్షేత్రం. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కొన్నేళ్లుగా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. భీమానది ఈ ప్రాంతంలోనే రాష్ట్రంలోకి ప్రవేశించి తంగిడి క్షేత్రంలోనే కృష్ణానదిలో కలుస్తుంది. దేవతలు నడయాడిన స్థలంగా, రుషులు, మునులు తపస్సు చేసిన దైవభూమిగా, ఎన్నో అద్భుతాలు, మహిమలు జరిగిన ప్రాంతంగా గుర్తింపు ఉందని చరిత్ర చెబుతుంది.

ఇదీ చరిత్ర..

మొదటి అవతార పురుషుడు శ్రీపాద వల్లభుడు తంగిడి క్షేత్రంలోని కృష్ణా, భీమా నదుల సంఘమ క్షేత్రంలో స్నానమాచరించి తపస్సు చేశారని.. అప్పటి నుంచి ఈ క్షేత్రం నివృతి సంఘమంగా పేరు గాంచిందని దత్త పీఠాధిపతులు చెబుతున్నారు. అలాగే ఈ ప్రాంతంలో అతి పురాతనమైన సంగమేశ్వరుడి ఆలయం కూడా ఉంది. శ్రీపాద వల్లభుడు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో జన్మించారు. ఇప్పటికీ ఆయన ఇల్లు అక్కడ ఉంది. అక్కడ 16 ఏళ్ల వరకు ఉండి దేశ సంచారం నిమిత్తం బయలుదేరారని.. అలా వెళ్లిన ఆయన కొన్నేళ్ల తర్వాత కార్తీక పౌర్ణమి రోజున తంగిడిలోని నివృతి సంఘమంలో ప్రత్యక్షమైనట్లు చరిత్ర చెబుతుంది. ఇక్కడ కొన్నేళ్ల పాటు తపస్సు చేసి ఇక్కడి నుంచి కర్ణాటకలోని కుర్మగడ్డకు వెళ్లారని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇప్పటికీ ఈ సంఘమంలో శ్రీపాదుడు తపస్సు చేసిన ప్రాంతంలో వినాయక విగ్రహం, ఆయన పాదుకలు, శివలింగం ఉన్నాయి. ఇక్కడి నుంచి కుర్మగడ్డకు నడుచుకుంటూ వెళ్లిన మార్గంలో నదిలో నల్లరాయితో రోడ్డు వేసినట్లు ఇప్పటికి కనిపిస్తోంది. ఈ ప్రాంత విశిష్టతను తెలుసుకున్న విఠల్‌బాబా దత్తభీమేశ్వర ఆలయాన్ని నిర్మించారు. ఈ నివృత్తి సంఘమంలో స్నానమాచరిస్తే పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం. ఇలాంటి క్షేత్రం తెలంగాణాలో మరెక్కడా లేదని.. ఇది ఒక మానస సరోవరమని దత్త పీఠాధిపతులు చెబుతున్నారు.


తంగిడిలోని దత్త భీమేశ్వర ఆలయం


నది అటువైపు కర్ణాటకలోని కుర్మగడ్డలోని శ్రీపాద వల్లభ క్షేత్రం

వంతెన నిర్మించాలి..


ఇటు తెలంగాణ.. అటు కర్ణాటకలో ఉన్న సంఘమ క్షేత్రాలకు రాకపోకలు సాగించేందుకు వంతెన నిర్మించాలి. అప్పుడే అక్కడి భక్తులు ఇక్కడకు, ఇక్కడి భక్తులు అక్కడకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. ఈ విషయంపై ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి.

– రాజశేఖర్‌స్వామి, పురోహితుడు

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి..


తంగిడి వద్ద ఉన్న సంఘమ క్షేత్రాన్ని ప్రభుత్వం పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. ఇక్కడికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు స్నానాలు చేసిన అనంతరం దుస్తులు మార్చుకొనేందుకు గదులు నిర్మించాలి. అలాగే తాగునీటి సౌకర్యం కల్పించాలి.

– ఈశప్పగౌడ, కృష్ణా

నేడు మహవీర్ పరిశ్రమపై చర్చ

బాలానగర్: మండలంలోని గుండేడ్ శివారులో ఏర్పాటు చేసిన మహవీర్ పరిశ్రమ యాజమాన్యం పొల్యూషన్ బోర్డు ఎస్‌ఈ సమక్షంలో గ్రామస్తులతో మరోమారు చర్చించి ప్రజాభిప్రాయం సేకరించనున్నట్లు జడ్చర్ల రూరల్ సీఐ జములప్ప తెలిపారు. బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం గుండేడ్ గ్రామస్తులతో చర్చలు జరిపారు. అందుకు గ్రామస్తులు నిరాకరించడంతో మంగళవారం హైదరాబాద్‌లో మారోమారు చర్చలు జరిపి పరిశ్రమపై వచ్చిన పొల్యూషన్ నివేదిక ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంటారని సీఐ తెలిపారు. గతంలో పలుమార్లు అవకాశం ఇచ్చినా పరిశ్రమ యాజమాన్యం కేవలం రాబడిపైనే దృష్టి సారించిందని, పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు, పరిశ్రమకు పక్కనే ఉన్న గుండేడ్ గ్రామస్తుల ఆరోగ్యం గురించి పట్టించుకోలేదు. ఈ క్రమంలో 2019లోనే గుండేడ్ గ్రామస్తులందరూ అనారోగ్యం బారినపడటంతో రాష్ట్ర ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామంలో క్యాంప్ ఏర్పాటు చేసి ప్రజలకు చికిత్స అందించిన విషయం గ్రామస్తులు గుర్తు చేశారు. కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టని పరిశ్రమను మూసేయాల్సిందేనని సర్పంచ్ నర్సింహరెడ్డి, గ్రామస్తులు తేల్చిచెప్పారు. రెడ్ జోన్‌లో ఉన్న ఐరన్ పరిశ్రమను ఎట్టి పరిస్థితిలో అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా కొందరు గ్రామస్తులను మచ్చిక చేసుకునేందుకు పరిశ్రమ యాజమాన్యం ప్రయత్నిస్తుందని, అలాంటి వారు ఎవరైనా గ్రామం నుంచి తరిమికొడతాం అని హెచ్చరించారు.

క్లుప్తంగా

బోర్‌వెల్ రాడ్ పడి యువకుడు మృతి

కోస్గి: ప్రమాదవశాత్తు బోర్‌వెల్ రాడ్ మీద పడటంతో యువకుడు మృతిచెందిన సంఘటన మున్సిపల్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం మేరకు పట్టణంలోని బోర్‌వెల్స్‌లో చత్తీస్‌ఘడ్‌కు చెందిన యువకులు కూలీలుగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి మున్సిపల్ పరిధిలోని నాగుసాన్‌పల్లిలో ఓ రైతు వ్యవసాయ పొలంలో బోరు వేసేందుకు బోర్‌వెల్ లారీ వెళ్లింది. బోరు వేస్తున్న క్రమంలో రాడ్ ప్రమాదవశాత్తు కైలాస్(19) అనే యువకుడిపై పడింది. రాడ్ ఒక్కసారిగా తలపై పడటంతో సదరు యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. తోటి కూలీలు అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేపల వలలో చిక్కుకుని వ్యక్తి మృతి



పాన్‌గల్: చేపలవేటకు వెళ్లి వలలో చిక్కుకుని మత్స్యకారుడు మృతిచెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామానికి చెందిన సంగనమోనిబాబు(50) గ్రామ సమీపంలోని ఆనకట్ట వాగులోకి చేపలవేటకు వెళ్లాడు.వాగులో చేపల కోసం వేసి వలల్లో చిక్కుకొని మృత్యువాతపడ్డాడు. ఇంటి యజమాని అకాల మరణంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు. భార్య చిన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుని కుటుంబాన్ని స్థానిక సర్పంచ్ రేణుమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేఖర్, మత్స్యకార సంఘం నాయకులు మౌలాలి, వెంకటస్వామి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

చేపలవేటకు వెళ్లి గల్లంతు



గండేడ్: గుట్టు చప్పుడుకాకుండా రాత్రివేళలో చేపలు పట్టుకోవడానికి వెళ్లిన ఓ వ్యక్తి గల్లంతయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని వెన్నాచేడ్ గ్రామానికి చెందిన పుల్లంగారి చిన్న మొగులయ్య(35) వ్యవసాయ కూలీ. ఇదే తరుణంలో ఆదివారం రాత్రి రెండు వలలు తీసుకుని వెన్నాచేడ్ పెద్దచెరువుకు చేపలు పట్టేందుకు వెళ్లాడు. గట్టుపై దుస్తులు, చెప్పులు పెట్టి రెండు వలలను చెరువులో వేసినట్టు ఆనవాళ్లు ఉన్నాయి. కానీ మొగులయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మహమ్మదాబాద్ ఎస్‌ఐ సైదయ్య చెరువు దగ్గరికి వెళ్లి వెతికించినా ఫలితం లేకపోయింది.

2 మద్యం దుకాణాల్లో చోరీ


సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యం

ఆత్మకూర్: పట్టణ శివారులోని శ్రీలక్ష్మి, భైరి మద్యం దుకాణాల్లో మంగళవారం అర్ధరాత్రి దొంగ చొరబడి నగదు ఎత్తుకెళ్లినట్లు ఎస్‌ఐ మహేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. దుకాణ యజమానులు రోజులాగే ఆదివారం రాత్రి దుకాణాలకు తాళం వేసి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం దుకాణాలు తెరచి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. శ్రీలక్ష్మి మద్యం దుకాణంలో భవనం వెంటిలేటర్‌ను ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించిన దొంగ రూ.23 వేలు ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న భైరి దుకాణం వెనుకభాగం గోడకు కన్నంవేసి లోపలికి చొరబడి రూ.21 వేలు ఎత్తుకెళ్లారు. ఘటన స్థలాలు, సీసీ ఫుటేజీలను ఎస్‌ఐ పరిశీలించి దొంగ చొరబడిన దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. దొంగను గుర్తించిన వారు సమాచారం ఇవ్వాలని కోరారు.

కొత్తకోటలో..

కొత్తకోట: ఓ ఇంట్లో దొంగతనం జరిగిన సంఘటన సోమవారం కొత్తకోటలోని బీపీఆర్ గార్డెన్ సమీపంలో చోటుచేసుకుంది. బాధితుడు శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సొంత పనిపై శంకర్ ఇంటికి తాళం వేసి వెళ్లగా, గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి రూ.30వేలు నగదు, తులంన్నర బంగారం, వెండి సామగ్రి ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 కుట్టుమిషన్ల చోరీ

ఆత్మకూర్: మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 15 కుట్టుమిషన్లు చోరీ అయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలోని స్టోర్ రూంలో కుట్టు మిషన్లు భద్రపరిచారు. సోమవారం స్టోర్ రూం గది తలుపులు తెరిచి ఉండటంతో పాఠశాల అటెండర్ హెచ్‌ఎం లక్ష్మీదేవమ్మకు దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో హెచ్‌ఎం గదిని పరిశీలించగా 40 కుట్టుమిషన్లకు గాను 15 కుట్టుమిషన్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ విషయమై హెచ్‌ఎం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర బండలాగుడు విజేత వనపర్తి

- రెండోస్థానంలో నంద్యాల జిల్లా

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సోమశిలలో శివరాత్రి సందర్భంగా సోమేశ్వరాలయం ఆవరణలో అంతర్రాష్ట్ర వృషభ రాజముల బండలాగుడు పోటీలు సోమవారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ఐదు జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరెడ్డి, గ్రామ సర్పంచ్ మద్దిలేటి పోటీలను ప్రారంభించారు. వనపర్తి జిల్లా, చిన్నంబావి మండలం పెద్దదగడ గ్రామానికి చెందిన గోపాలకృష్ణ ఎద్దు 2,044 ఫీట్లు లాగి విజేతగా నిలిచాయి. మొదటి బహుమతిగా రూ.50వేలు అందజేశారు. నంద్యాల జిల్లా పీఆర్‌పల్లి కి చెందిన చిన్ననాగన్న ఎద్దు 1,920 ఫీట్లు లాగి రెండో స్థానంలో నిలిచి, ద్వితీయ బహుమతి రూ.40వేలు దక్కించుకున్నాయి. గద్వాల జిల్లా కంచిపాడుకు చెందిన సుధాకర్ రెడ్డి ఎద్దు 1,790 ఫీట్లు లాగి మూడో బహుమతి కింద రూ.30 వేలు గెలుపొందాయి. అనంతపురం జిల్లా బాలనాగరాజు ఎద్దు 1,760 ఫీట్లు లాగి రూ.20వేలు అందుకున్నాయి. ఐదో స్థానంలో అనంతపురం జిల్లా కృష్ణాపురం గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి ఎద్దు 1,660 ఫీట్లు లాగి రూ.10వేలు అందుకున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ గోవింద రెడ్డి, సర్పంచ్ మద్దిలేటి, గ్రామపెద్దలు నగదును అందజేశారు.


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బాలికపై అత్యాచారం: కేసు నమోదు

పాన్‌గల్: బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(13) నాలుగు రోజుల క్రితం పాఠశాలకు వెళ్తుండగా ఇదే గ్రామానికి చెందిన ఉదయ్‌కిరణ్(21) మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అయితే బాలిక పాఠశాలకు రాలేదని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలోనే బాలిక సదరు యువకుడి ఇంటి నుంచి వస్తుండటం గమనించి నిలదీయడంతో అత్యాచారం చేసినట్లు వివరించింది. దీంతో కుటుంబ పరువు పోతుందనే ఉద్దేశంతో విషయం బయటకు పొక్కనీయలేదు. తప్పనిసరి పరిస్థితిలో సోమవారం బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో విషయం బయటపడింది. ఈ ఘటనపై బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని బాలికను వైద్య పరీక్షల నిమిత్తం వనపర్తి ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ధర్మవరం సమీపంలో పేకాట స్థావరంపై సోమవారం కోదండాపురం పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. సమాచారం మేరకు దాడులు చేసినట్లు ఎస్సై వెంకటస్వామి తెలిపారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు, రూ. 54,120 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విగ్రహాల చోరీ నిందితునికి జైలుశిక్ష

పెద్దకొత్తపల్లి: మండలంలోని గంట్రావ్‌పల్లి గ్రామంలోని 4నెలల కిందట సీతారామ, లక్ష్మణ, శివుడు పార్వతి ఐదు పంచలోహ విగ్రహాలను దొంగతనం చేసిన ఈశ్వర్‌పై కేసు నమోదు చేసి కొల్లాపూర్ కోర్టులో హాజరుపర్చారు. కోర్టు ప్రథమశ్రేణి న్యాయమూర్తి జోస్న నిందితుడికి రెండేళ్ల 3నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. విగ్రహాలను స్వాధీనం చేసుకొని కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు.

నిజాం కాలం నాటి బ్రిడ్జికి మరమ్మతు


కర్ణాటక, తెలంగాణను కలుపుతూ కృష్ణానదిపై ఉన్న బ్రిడ్జి


బ్రిడ్జికి వేసిన బేరింగ్‌లు దెబ్బతినడంతో ఏర్పడ్డ గుంతలు

- తెలంగాణ, రాయచూర్ మధ్య బ్రిడ్జికి మరమ్మతు
- దారి మళ్లించనున్న అధికారులు

కృష్ణా: తెలంగాణ– కర్ణాటక సరిహద్దులోని కృష్ణానదిపై నిజాం కాలంలో నిర్మించిన బ్రిడ్జిని మరమ్మతు చేసేందుకు అధికారులు తాత్కాలికంగా రాకపోకలు నిలిపివేశారు. మండల సరిహద్దులో ఉన్న ఈ బ్రిడ్జికి ఎన్‌హెచ్ అధికారులు మరమ్మత్తు పనులకు 22వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 25న రాత్రి 10 గంటల వరకు బ్రిడ్జిపై పూర్తిగా రాకపోకలు నిలిపివేయనున్నారు. ఇందుకు గాను రాయచూర్ ఎస్పీ, నారాయణపేట్ ఎస్పీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. రాయచూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలను గద్వాల్ మీదుగా వెళ్లాలని, జూరాల బ్రిడ్జిపై నుంచి వెళ్లవచ్చని అధికారులు సూచించారు.

ప్రమాదకరంగా బ్రిడ్జి

కర్ణాటక ప్రభుత్వం 2016లో బ్రిడ్జిపై కొత్తగా సీసీ రోడ్డు వేసినా ఉపయోగం లేకుండా పోయింది. సీసీ రోడ్డులో బేరింగ్‌లు ఎక్కడికక్కడ లేచిపోవడంతో వాటి మూలంగా రాత్రి సమయాల్లో వాటిని గమనించకుండా వెళ్లిన ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించడంతో అధికారులు మరోమారు బ్రిడ్జి మరమ్మతుకు చర్యలు చేపట్టారు.

నిజాం కాలం నాటి బ్రిడ్జి

హైదరాబాద్ నిజాం నవాబు పరిపాలన సమయంలో కృష్ణానదిపై అటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ప్రజలకు ప్రయాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు బ్రిడ్జి నిర్మాణం మొదలుపెట్టారు. అప్పట్లో ఈ బ్రిడ్జికి రూ.13,28,500 వెచ్చించారు. 1933లో నిర్మాణం ప్రారంభం కాగా 1943లో ముగిసింది. దీనికి మహ్మద్ హమీద్ మిర్జా చీఫ్ ఇంజినీర్‌గా, సబ్బీర్ యూసుఫ్, ఫారాత్తుల్లా ఇంజినీర్లుగా, కాంట్రాక్టర్‌గా బాల్‌రాం వ్యవహరించారు.

కొత్త బ్రిడ్జిని నిర్మించాలి


ప్రస్తుతం ఉన్న బ్రిడ్జిపై ప్రయాణాలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. కేవలం 20 ఫీట్ల వెడల్పు ఉండడం మూలంగా పెద్ద వాహనాలు వస్తే మరో వాహనం ఎదురు వెళ్లలేక పోతుంది. అందుకు కొత్తగా మరో బ్రిడ్జిని నిర్మిస్తే ప్రయాణికులకు మేలు కలుగుతుంది. బ్రిడ్జిపై రోడ్డు ఇరుకుగా ఉండడం మూలంగా తరుచూ ప్రమాదాలు అవుతున్నాయి.

– నర్సిరెడ్డి, హిందుపూర్

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఊట్కూరు: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాములు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొల్లూరుకు చెందిన ఎద్దుల రవి(24) ఈనెల 17న నారాయణపేట జిల్లా కేంద్రంలోని డంపింగ్‌యార్డ్‌లో వాచ్‌మెన్‌గా విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళ్తున్నాడు. ఓబులాపురం శివారులో అదుపుతప్పి మైలురాయిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

- పలువురికి గాయాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాగర్‌కర్నూల్, ఇటిక్యాల, భూత్పూర్, మహబూబ్‌నగర్‌లో చోటు చేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. అదేవిధంగా పలువురికి గాయాలయ్యాయి.


ప్రమాదంలో బోల్తాపడిన ఆటో


మారేడు పద్మ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ఎదురుగా వచ్చిన కోడెదూడను తప్పించబోయి ఆటోబోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాల శివారులో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెల్కపల్లి మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన శివరాములు తన ఆటోలో పలువురు ప్రయాణికులను నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి తీసుకువస్తుండగా, దేశిటిక్యాల శివారులో ప్రధాన రహదారిపై ఎదురుగా వచ్చిన కోడేదూడను తప్పించబోయి ఆటో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న మారేడు పద్మ(40) అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన పలువురిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో బాలపీరు, పెద్దబాలయ్యకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. వెంకటమ్మ, బొందయ్య, కోటయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి వాహనం బోల్తా..

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందగా మరో ముగ్గురికి గాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్‌ఐ వెంకటస్వామి కథనం మేరకు.. అలంపూర్ మండలం లింగనవాయికి చెందిన రాజేష్ (35), మైబు, నౌషద్, కర్నూలుకు చెందిన రియాజ్ బొలెరో వాహనంలో ఆదివారం పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి కర్నూలుకు బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున ఇటిక్యాల మండలం వేముల స్టేజీ సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రాజేష్ అక్కడికక్కడే మృతిచెందగా.. డ్రైవర్ రియాజ్‌తో పాటు మైబు, నౌషద్‌కు గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. రాజేష్ భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన తన్నీరు విష్ణు(22) తల్లి సైదమ్మతో కలిసి మన్యంకొండ జాతరలో బొమ్మలు, గాజుల వ్యాపారం చేసేందుకు వచ్చారు. తన్నీర్ విష్ణు ద్విచక్ర వాహనంపై జడ్చర్లకు చెందిన అబుబాకర్‌తో కలిసి పని నిమిత్తం కొండ కింద పనులు ముగించుకొని ఘాట్ మార్గం ద్వారా కొండ పైకి వెళ్తున్నారు. మార్గమధ్యలో బైక్ అదుపుతప్పి బండరాయికి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విష్ణు, అబుబాకర్‌ను అంబులెన్స్ ద్వారా జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. విష్ణు అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. అబుబాకర్ చికిత్స పొందతున్నాడు. మృతుడి తల్లి సైదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రెండు వాహనాలు ఢీకొని..


వెంకటేష్ (ఫైల్)

భూత్పూర్: మండలంలోని చౌళ్ల తండా స్టేజీ వద్ద జరిగిన బొలెరో కారు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఇద్దరికి గాయాలయ్యాయి. బంధువుల కథనం మేరకు.. మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన ప్యాట వెంకటేష్(35) హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. బిజినేపల్లిలో ఓ ఫంక్షన్ నిమిత్తం మహేష్ (ఉదండాపూర్), రాఘవేందర్ (బిజినేపల్లి)లతో కలిసి కారులో వచ్చాడు. ఫంక్షన్ నుంచి తిరిగి భూత్పూర్ వైపు వస్తుండగా చౌళ్లతండా స్టేజీ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న బొలెరోను ఢీకొంది. దీంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మహేష్, రాఘవేందర్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. వెంకటేష్‌కు భార్య శారద, ముగ్గురు సంతానం ఉన్నారు. ప్రమాదం జరిగినది వాస్తవమేనని, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ భాస్కర్ రెడ్డి తెలిపారు.


నుజ్జునుజ్జయిన కారు

ఆటో ఢీకొని వృద్ధుడు..


సాయప్ప(ఫైల్)

రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ఆటో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. టూటౌన్ ఎస్‌ఐ రవి ప్రకాష్ తెలిపిన వివరాలు ఇలా.. నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం రెనిపట్లకు చెందిన సాయప్ప(65) ఆదివారం సాయంత్రం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డు దాటుతుంటే అశోక్‌టాకీస్‌చౌరస్తా నుంచి న్యూటౌన్ వెళ్లే ఆటో డ్రైవర్ వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించి టీడీగుట్టలో ఉన్న బంధువుల ఇంటికి తీసుకువెళ్లారు. రాత్రి 11గంటల తర్వాత సాయప్పకు గొంతుపూర్తిగా వాపురావడంతో మాట్లాడటానికి ఇబ్బంది పడుతుంటే కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కొడుకు భీమప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ మహ్మద్ సయ్యద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఆరె కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చెట్టిపల్లి శివాజీ



ఆరె కుల సంఘం నూతన కమిటీ అధ్యక్షుడు చెట్టిపల్లి శివాజీ తదితరులు

అంబర్‌పేట (హైదరాబాద్): ఆరె కుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. సోమవారం అంబర్‌పేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో కమిటీ ఆవిర్భవించింది. అధ్యక్షుడిగా చెట్టిపల్లి శివాజీ, గౌరవ అధ్యక్షుడిగా నాగూర్ల వెంకన్న, స్టీరింగ్ కమిటీ చైర్మన్‌గా దిగంబర్‌రావు, క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా రాంబాబు, ఉద్యమ కమిటీ చైర్మన్‌గా అంజన్‌రావు, ఆరె కుల రైతు సంఘ అధ్యక్షుడిగా మోర్తాల చందర్‌రావుతో పాటు వివిధ కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ పలు తీర్మానాలను ఆమోదించింది. ఉప్పల్ బగాయత్‌లో ఆరె కుల సంఘానికి ఒక ఎకరం స్థలం, రూ.కోటి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినందుకు సీఎం కేసీఆర్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. అలాగే భవన నిర్మాణానికి మరో రూ.4 కోట్ల నిధుల కోసం విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. ఆరె కుల సంఘాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ తీర్మానించారు. సమావేశంలో కుల సంఘం నాయకులు రామ నర్సింహయ్య, కోల కృష్ణస్వామి, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

గొప్పగా.. గర్వంగా!

- మునుపెన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయం అమలు చేస్తున్నాం: ఏపీ సీఎం జగన్
- ఎమ్మెల్సీలుగా 18 మంది పేర్లు ఖరారు.. 14 మంది బీసీ, ఎస్టీ, ఎస్సీలే
- మిగిలిన 4 సీట్లలో ఒక్కో సామాజిక వర్గానికి ఒక్కొక్కటి



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: మునుపెన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయాన్ని అమలు చేస్తున్నామని, ఇంత గొప్పగా ఎప్పుడూ జరగలేదని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మనం చేసిన సామాజిక న్యాయాన్ని ప్రతి నియోజకవర్గంలో వినిపించాలని, ప్రతి గడపకూ చేరవేయాలని ఎమ్మెల్సీ అభ్యర్థులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ తరఫున స్థానిక సంస్థల కోటా, ఎమ్మెల్యే కోటా, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించిన వారితో ముఖ్యమంత్రి జగన్ సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

సుదీర్ఘ కసరత్తు అనంతరం..

గతంలో ఎప్పుడూ చూడనంత, జరగనంత సామాజిక న్యాయాన్ని దేవుడి దయతో మన పార్టీలో చేయగలుగుతున్నామని గర్వంగా చెప్పుకునే గొప్ప పరిస్థితుల్లోకి వచ్చాం. ఇవాళ చాలా సుదీర్ఘ కసరత్తు అనంతరం 18 మందిని ఖరారు చేస్తే వారిలో 14 మంది బీసీ, ఎస్టీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వారే. ఇంత గొప్పగా సామాజిక న్యాయం ఎప్పుడూ జరగలేదు. మిగిలిన సామాజిక వర్గాలకు నాలుగు సీట్లిస్తే అందులో కూడా ఒక్కో సామాజిక వర్గానికి ఒకటి చొప్పున కేటాయించాం. మనం చేస్తున్న సామాజిక న్యాయం ప్రతి గడపకూ తెలియాలి, ప్రతి నియోజకవర్గంలోనూ చెప్పాలి.

ధీటుగా, మరింత దూకుడుగా..

పదవులు పొందిన వారు పార్టీని బలోపేతం చేయాలి. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాల్లో యాక్టివ్‌గా ఉండాలి. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 లాంటివి ఒక్కటై లేనిపోని విషప్రచారం చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మనం కూడా అంతే ధీటుగా, యాక్టివ్‌గా, మరింత దూకుడుగా పనిచేయడం ద్వారా మన వాణిని సమర్థంగా వినిపించాలి.

వారిని కన్విన్స్ చేసుకుంటూ వెళ్లాలి

ఈ పదవులను ఆశించిన వారు ఇంకా చాలా మంది ఉన్నారు. ఉన్న పదవులు తక్కువ, ఆశావహులు ఎక్కువగా ఉంటారు కాబట్టి అందర్నీ సంతృప్తి పరచలేం. కొద్దో గొప్పో కొరత ఉంటుంది. వీరందరికీ కూడా చెప్పే రీతిలో నచ్చచెబుతూ, కన్విన్స్ చేసుకుంటూ వెళ్లాలి.

మిగతా వారికి ఈసారి

దేవుడు ఆశీర్వదిస్తే గత ఎన్నికల కంటే ఈసారి అత్యధిక స్థానాలు సాధిస్తాం. ఇంకా చాలా మందికి రాబోయే రోజుల్లో ఎక్కువ అవకాశాలు వస్తాయి. చంద్రబాబు అరకొర పదవులిచ్చి బీసీలకు అన్నీ చేసినట్లు ప్రచారం చేసుకోవటాన్ని మనం చూశాం. ఈసారి మనం వడ్డీలు, వడ్డెర కులాల వారికి అవకాశం ఇచ్చాం. రజకులు, నాయీ బ్రాహ్మణులు, ఇంకా మిగిలిన కులాలకు తదుపరి దఫాలో తప్పకుండా అవకాశం ఇస్తామని భరోసా ఇస్తున్నాం.

మేమంతా ఒక్కటే

కాంగ్రెస్ పార్టీ నేతలంతా కలిసే ఉన్నాం

- ఓరుగల్లు ఎమ్మెల్యేలు దండుపాళ్యం ముఠా
- డైరీ రాస్తున్నాం... వడ్డీతో చెల్లిస్తాం
- తెలంగాణలో టీఆర్ఎస్, బీజేపీ నేతల భూకబ్జాలు...
- వరంగల్ హాథ్ సే హాథ్ జోడో యాత్రలో రేవంత్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, వరంగల్: 'మేమంతా ఒక్కటే.. మా నాయకులంతా కలిసే ఉన్నాం.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేసీఆర్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు ఈ రాష్ట్ర ప్రజలు, మేం సిద్ధంగా ఉన్నాం.. 2024 జనవరిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుంది'అని టీపీసీసీ చీఫ్ ఎనుముల రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం హనుమకొండ అమృత జంక్షన్ వద్ద నిర్వహించిన సభలో ప్రసంగించారు. బీఆర్ఎస్ నేతలే కాదు.. బీజేపీ నేతలు కూడా భూములు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా నష్టం జరుగుతున్నా అమరుల ఆకాంక్ష మేరకు సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, కానీ సరైన పరిపాలన జరగక కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ బొందల గడ్డగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో నివేదిక ప్రకారం రాష్ట్రంలో 80 వేలమంది రైతులు, మూడు వేల మంది నిరుద్యోగుల ఆత్మహత్యలు చేసుకున్నారని వివరించారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు ఇప్పటికీ పూర్తికాలేదు కానీ 9 నెలల్లో 10 ఎకరాల్లో 150 గదులతో దొరల గడీలను తలపించే ప్రగతి భవన్ మాత్రం పూర్తయిందని ఎద్దేవా చేశారు.

ఈస్ట్, వెస్ట్ ఎమ్మెల్యేలు బిల్లా రంగాల్లా దోచుకుంటున్నారు

వరంగల్ ఎంపీ పసునూరు దయాకర్ పసిపిల్లగాడు అనుకుంటున్నారని, కానీ ఆర్టీసీ టైర్ల ఫ్యాక్టరీని మూసివేసి హంటర్ సెంటర్లో 6 ఎకరాల భూమిని కాజేసిన ఘనత ఆయనదని ఆరోపించారు. ఓరుగల్లు ఎమ్మెల్యేలు దండుపాళ్యం ముఠా అని, వరంగల్ ఈస్ట్, వెస్ట్ ఎమ్మెల్యేలు బిల్లా రంగాల్లా ప్రజలను దోచుకుంటున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 'వరంగల్‌లో ఏ ఎమ్మెల్యేను తీసుకున్నా ఉద్యమం సమయంలో వీరి దగ్గర ఏమీ లేదు. కానీ ఇప్పుడు వేల కోట్లకు పడగలెత్తారు. దండుపాళ్యం ముఠాకు హన్మకొండ సాక్షిగా హెచ్చరిక చేస్తున్నా. గోడ మీద రాసిపెట్టుకోండి. రోజులు లెక్కపెట్టుకోండి. డైరీలో ప్రతి ఒక్కటీ నోట్ చేసుకుంటున్నాం. మా పార్టీ నాయకులు, కార్యకర్తల మీద కేసులు పెట్టి వేధించిన దండుపాళ్యం ముఠాకు ఇంతకింత మిత్తితో సహా చెల్లిస్తాం'' అని హెచ్చరించారు. పాదయాత్రకు ముందు కాజీపేటలోని హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియబాని దర్గాను దర్శించుకొని రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ, మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, మాజీ మంత్రులు మహ్మద్ అలీ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నేతపై దాడి

రేవంత్ యాత్ర ముగింపు తరువాత ఘటన



వరంగల్ క్రైం: హనుమకొండలో సోమవారం రాత్రి కాంగ్రెస్ యువజన నాయకుడు తోట పవన్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బహిరంగసభ ముగిసిన కొన్ని నిమిషాలకే సభావేదికకు వంద మీటర్ల దూరంలోనే ఈ దాడి జరిగింది. ముక్కు, కుడి కన్ను భాగంలో బలమైన గాయాలయ్యాయి. వీపుపై వాతలు తేలాయి. రక్తపుమడుగులో ఉన్న పవన్‌ను స్థానికులు గమనించి హుటాహుటిన సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకున్నారు. డీసీసీ నేత నాయిని రాజేందర్‌రెడ్డి ఆస్పత్రి వద్ద మాట్లాడుతూ పవన్‌పై బీఆర్ఎస్ కార్యకర్తలే దాడి చేశారని ఆరోపించారు.

ప్లకార్డులతో నిరసన..: రేవంత్‌రెడ్డి యాత్ర సమయంలో హనుమకొండలోని బాలసముద్రం అంబేడ్కర్ కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పేదలకు పంచాలని తోట పవన్ డిమాండ్ చేస్తూ స్థానికులతో కలిసి ప్రదర్శన చేపట్టారు. ఆ తరువాత రేవంత్ బహిరంగ సభలో స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీని ప్రదర్శించారు. ఆ సభ ముగియగానే ఈ దాడి జరిగింది.

సాయన్నకు తుది వీడ్కోలు



సాయన్న అంతిమయాత్ర దృశ్యం

కంటోన్మెంట్ (హైదరాబాద్): బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ఆత్మీయుల అశ్రునయనాల మధ్య ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలు ముగిశాయి. అశోక్‌నగర్‌లోని సాయన్న నివాసం నుంచి ఆయన భౌతికకాయాన్ని సోమవారం ఉదయం 11.30కి కార్ఖానాలోని క్యాంపు ఆఫీసుకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం వరకు అభిమానుల సందర్శనార్థం అక్కడే ఉంచారు. మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్ తదితరులు నివాళులు అర్పించారు. మధ్యాహ్నం 3.00 గంటలకు క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమైన సాయన్న అంతిమయాత్ర.. సాయంత్రం 5.00 గంటలకు మారేడుపల్లి శ్మశానవాటికకు చేరుకుంది. సాయన్నకు ముగ్గురు కుమార్తెలు నమ్రత, నివేదిత, లాస్య నందిత ఉండగా.. పెద్ద కుమార్తె నమ్రత భర్త చందు ముందు నడిచి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా... సాయన్న భౌతికకాయాన్ని దహనవాటిక వద్ద దింపి ఆఖరి క్రతువు చేపడుతుండగా.. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సాయన్నకు ప్రభుత్వ అధికార లాంఛనాలు చేపట్టడం లేదేమంటూ అభిమానులు ఆందోళనకు దిగారు. అక్కడే ఉన్న మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావులను దీనిపై నిలదీశారు. ఈ క్రమంలో మంత్రి తలసాని ఆందోళనకారుల వద్దకు వచ్చి కాసేపట్లో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరుగుతాయని చెప్పి వెళ్లిపోయారు. కాసేపటికే మంత్రి మల్లారెడ్డి కూడా వెళ్లిపోవడంతో ఆందోళన చేస్తున్న అభిమానులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కానీ పోలీసులు తమకు అధికారిక ఉత్తర్వులేవీ లేవని, సూర్యాస్తమయం తర్వాత అధికార లాంఛనాలు నిర్వహించే అవకాశం లేదని తేల్చి చెప్పారు. పద్మారావు తదితరులు సాయన్న భార్య, కుమార్తెలతో మాట్లాడి అంత్యక్రియలు పూర్తి చేయాల్సిందిగా ఒప్పించారు. సాయన్న కుటుంబీకుల విజ్ఞప్తితో ఆందోళనకారులు శాంతించగా.. రాత్రి 7.30 గంటలకు అంత్యక్రియలు ముగిశాయి.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే

- మొత్తం 18 మంది అభ్యర్థులను ప్రకటించిన వైఎస్సార్‌సీపీ
- బీసీలకు 11, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, ఓసీలకు 4 కేటాయింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసనమండలిలో ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న 9 స్థానిక సంస్థల నియోజకవర్గాలతో పాటు.. ఎమ్మెల్యే కోటాలో ఖాళీ కానున్న 7 స్థానాలకు వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఖరారు చేశారు. గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న రెండు స్థానాలకు సంబంధించిన అభ్యర్థులను కూడా సీఎం వైఎస్ జగన్ ప్రతిపాదించారు. మొత్తం 18 మంది అభ్యర్థుల వివరాలను వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాకు వెల్లడించారు. బీసీలకు 11, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, ఓసీలకు 4 కేటాయించారు.

సామాజిక వర్గాల వారీగా ఎమ్మెల్సీ అభ్యర్థులు

కోటా	బీసీ	ఎస్సీ	ఎస్టీ	ఓసీ	మొత్తం
స్థానిక సంస్థలు	6	1	0	2	9
ఎమ్మెల్యేల కోటా	4	1	0	2	7
గవర్నర్ కోటా	1	0	1	0	2
మొత్తం	11	2	1	4	18

స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు

నర్తు రామారావు
కుడిపూడి సూర్యనారాయణ
వంకా రవీంద్రనాథ్
కవురు శ్రీనివాస్
మేరుగ మురళీధర్
సిపాయి సుబ్రమణ్యం
పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి
ఎ.మధుసూదన్
ఎస్.మంగమ్మ

ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు

పెన్మత్స సూర్యనారాయణరాజు
పోతుల సునీత
కోలా గురువులు
బొమ్మి ఇజ్రాయెల్
జయమంగళ వెంకటరమణ
చంద్రగిరి ఏసురత్నం
మర్రి రాజశేఖర్

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ప్రతిపాదించిన అభ్యర్థులు

కుంభా రవిబాబు
కర్రి పద్మశ్రీ

నీటిగుంతలో పడి వ్యక్తి మృతి

నవాబుపేట: మండల పరిధిలోని సిద్ధోటం గ్రామంలో నీటిగుంతలో పడి వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన నెత్తికొప్పుల కృష్ణయ్య (59) రెండు రోజుల క్రితం గ్రామ సమీపంలోని నీటిగుంతలో పడి మృతి చెందాడు. రెండు రోజులుగా కనిపించలేదు. అతడు మతిస్థిమితం లేని వ్యక్తి కావడంతో వస్తాడని అనుకున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. తీరా గ్రామ సమీపంలోని గుంతలో సోమవారం శవమై కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం అంత్యక్రియలు పూర్తి చేశారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని ఫిర్యాదు

నాంపల్లి: పులిగుట్టపై మైనింగ్ తవ్వకాల అనుమతులు రద్దు చేసేలా ప్రభుత్వానికి వెంటనే ఆదేశాలు ఇవ్వాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం అమడబాకుల గ్రామస్తులతో కలిసి మైనింగ్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని ఆయన హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వనపర్తి జిల్లా కొత్తకోట మండలం అమడబాకులలోని పులిగుట్టపై 20 ఏళ్ల క్రితం మైనింగ్ తవ్వకాలకు ప్రైవేట్ వ్యక్తులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. గ్రామస్తులంతా వ్యతిరేకించడంతో 20ఏళ్ల మైనింగ్ తవ్వకాలకు సంబంధించిన పనులు నిలిపివేసి తాజాగా మళ్లీ తవ్వకాలు ప్రారంభించారని పేర్కొన్నారు. తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాన్ని పరిశీలించడానికి వెళ్లిన గ్రామస్తులను కొత్తకోట సీఐ శ్రీనివాస్ రెడ్డి పోలీసు స్టేషన్‌కు పిలిపించి నిబంధనలకు విరుద్ధంగా దాదాపు 4 గంటల పాటు స్టేషన్‌లో ఉంచడమే కాకుండా వారిని తీవ్ర అసభ్య పదజాలంతో దూషించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కల్పితమైన తప్పుడు నివేదికలతో లీజు రెన్యువల్ చేసిన మైనింగ్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాములు యాదవ్, సురేంద్రాచారి, ప్రకాష్‌శెట్టి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కుమారుడిపై కేసు నమోదు

గద్వాల క్రైం: తండ్రిని చితకబాదిన సంఘటనపై కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ అబ్దుల్‌షుకుర్ తెలిపారు. పట్టణంలోని రెండో రైల్వే గేట్ కాలనీ సమీపంలో నివాసం ఉంటున్న సాయిబాబా తన కుమారుడైన రామలింగంల మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి తండ్రి కొడుకుల మధ్య ఆస్తి వివాదంపై జరగగా ఆవేశంలో కుమారుడు తండ్రి తలపై బలంగా కర్రతో కొట్టాడు. దీంతో తండ్రికి తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రామలింగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపాడు.

ఖాతాల్లోంచి 'రైతుబంధు' వెనక్కి!



జడ్చర్ల వ్యవసాయశాఖ కార్యాలయం

- బ్యాంకు ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లో మార్పే కారణం
- 3వేల మంది రైతులకు అందని వైనం
- పునరుద్ధరణ చర్యలు చేపట్టిన అధికారులు

జడ్చర్ల: ప్రభుత్వం రైతులకు అందించే రైతుబంధు పథకం సాయం చిన్న తప్పిదం వలన అందకుండా పోయింది. ప్రభుత్వం రైతుబంధు సొమ్మును రైతుల ఖాతాలలో జమ చేసినట్లు వచ్చిన మెసేజ్‌తో సంబర పడిన వారు, తర్వాత 'ఒక కారణంగా మీ డబ్బులను మీ ఖాతాలో జమ చేయలేకపోతున్నాము. సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని' పేర్కొంటూ మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు రావడంతో రైతులు ఖంగుతున్నారు.

బ్యాంకు విలీనంతో ఏర్పడిన సమస్య

జడ్చర్ల, మిడ్జిల్ మండలాలకు చెందిన రైతుల బ్యాంకు ఖాతాలు జడ్చర్లలోని ఆంధ్రాబ్యాంకులో ఉన్నాయి. అయితే ఈ బ్యాంకును గతేడాది యూనియన్ బ్యాంకులో విలీనం చేయడంతో ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారింది. అయితే వానాకాలం సీజన్‌లో పాత ఆంధ్రాబ్యాంకుగా కొనసాగిన ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఉన్నా రైతుబంధు సాయం రైతుల ఖాతాలలో జమ అయ్యింది. తదుపరి బ్యాంకు ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారడంతో రైతులు, వ్యవసాయశాఖ అధికారులు బ్యాంకు ఖాతా ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌ను మార్చలేదు. దీంతో ఇటీవల యాసంగి సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన రైతుబంధు సాయం ఖాతాలలో జమకాలేదు.

3వేల మంది రైతులు..

ఈ రెండు మండలాలకు చెందిన దాదాపు 3వేల మంది రైతుల ఖాతాలు సిగ్నల్‌గడ్డలో కొనసాగుతున్న యూనియన్ బ్యాంకులో ఉన్నాయి. వీరందరికి దాదాపుగా 3 నుంచి 5వేల ఎకరాలకు పైగా రైతుబంధు సాయం నిలిచిపోయింది. సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన రైతుబంధు సాయం విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎదురు చూస్తున్నాం



రైతుబంధు సాయం కోసం ఎదురు చూస్తున్నాం. బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయ లోపం కారణంగా సమస్య తలెత్తింది. బ్యాంకు ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మార్పు చేసినట్లు వ్యవసాయశాఖ, రైతులకు సమాచారం ఇచ్చుంటే సమస్య వచ్చేది కాదు. అధికారులు రైతుబంధును తమ ఖాతాలలో జమచేసేలా చర్యలు తీసుకోవాలి.

– రామకృష్ణారెడ్డి, సర్పంచ్, కిష్టంపల్లి

మెసేజ్‌లు వచ్చాయి కానీ జమ కాలేదు



రైతుబంధు తమ బ్యాంకు ఖాతాలలో జమైనట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. తీరా బ్యాంకుకు వెళ్లి చూస్తే డబ్బు జమ కాలేదని అధికారులు తెలిపారు. ఐఎఫ్ఎస్‌సీ కోడ్ కారణంగా రైతుబంధు పడలేదని తెలిపారు.

– వెంకటయ్య, కిష్టంపల్లి, జడ్చర్ల మండలం

సరిచేసి పంపాం..



యూనియన్ బ్యాంకులో విలీనమైన ఆంధ్రాబ్యాంకుకు సంబంధించిన ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారడం వలనే రైతుబంధు సాయం నిలిచిపోయిందని ఉన్నతాధికారులు తెలిపారు. వెంటనే ఆయా గ్రామాలకు చెందిన రైతుల బ్యాంకు ఖాతాలకు కొత్త ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌ను మార్పు చేస్తూ తిరిగి ఉన్నతాధికారులను నివేదించాం. త్వరలోనే సాయం మంజూరయ్యే అవకాశం ఉంది.

– గోపినాథ్, మండల వ్యవసాయ అధికారి, జడ్చర్ల

పోలీస్ ఈవెంట్స్‌లో 414 మంది అర్హత



1600 మీటర్ల పరుగులో పాల్గొన్న అభ్యర్థులు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఎస్ఐ, కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం 1,218 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 1,092 మంది హాజరయ్యారు. వీరిలో 414 మంది తుది రాత పరీక్షకు అర్హత సాధించారు. గత ఐదు రోజులుగా జరిగిన దేహదారుఢ్య పరీక్షల్లో 1,724 మంది అభ్యర్థులు తుది పరీక్షకు అర్హత పొందారు. దేహదారుఢ్య పరీక్షలను ఐపీఎస్ అధికారి యోగేష్ గౌతమ్, ఎస్పీ నరసింహ, నోడల్ ఆఫీసర్ రాములు పర్యవేక్షించారు.



లాంగ్‌జంప్ దూకుతున్న ఓ అభ్యర్థి

రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్ పాత్ర శూన్యం

మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు: రాజీనామాలతో రాష్ట్రం ఆవిర్భవించలేదని, సకలజనులు పోరాటం, అమరుల త్యాగ ఫలితమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో 2014లో లోక్‌సభ, రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదించిన దినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి ఒత్తిడి వల్లే సోనియా గాంధీ, అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్, రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని పార్లమెంట్‌లో చర్చించి, ఆమోదించారని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో చర్చల సందర్భంలో బీజేపీ నేతలు సుష్మాస్వరాజ్, అరుణ్‌జైట్లీ సహకారంతో రాష్ట్రం సాకారమైందని తెలిపారు. 1969 ఉద్యమంలో తాను జైలు జీవితం గడపడంతో పాటు ఎందరో సహచరులను కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాని రాష్ట్ర ఏర్పాటులో టీఆర్ఎస్ పాత్ర ఏమీ లేదని, సీఎం కేసీఆర్ పొత్తులతో ఎన్నికలలో నిలబడడం, రాజీనామాలు చేయడం తప్ప రాష్ట్ర సాధనలో ఆయన చేసింది శూన్యమన్నారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా, కుటుంబ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో నాగం శశిధర్‌రెడ్డి, రవి, రోహిణి, మల్లయ్య గౌడ్, లక్ష్మయ్య, పాండు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో రైతులకు తోడ్పాటు



యాంత్రీకరణ వినియోగం గురించి రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

మహబూబ్‌నగర్ రూరల్: కూలీల కొరత ఎక్కువ అవసరం పడే పంటల సాగు సమయంలో యాంత్రీకరణ ఎంతో తోడ్పాటు ఇస్తుందని శాస్త్రవేత్త మమత అన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం పాలెం శాస్త్రవేత్తలు సోమవారం మండలంలోని అల్లీపూర్‌లో పర్యటించారు. గ్రామంలో 'వేరుశనగ డిగ్గర్ సమయంలో పంట కోత' అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త మాట్లాడుతూ కూలీల కొరతను అధిగమించడమే కాకుండా యాంత్రీకరణతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంట కోతను చేపట్టవచ్చునని తెలిపారు. వ్యవసాయ ఇంజినీరింగ్ విభాగం శాస్త్రవేత్త మస్తానయ్య మాట్లాడుతూ రైతులు వేరుశనగ డిగ్గర్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డిగ్గర్ వినియోగంలో రైతులు మెళకువలు పాటించాలని పేర్కొన్నారు. అనంతరం ట్రాక్టర్ కంపెనీ ప్రతినిధులు లక్ష్మణ్, రాఘవేంద్ర రైతులకు ట్రాక్టర్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

కురుమూర్తిస్వామికి ప్రత్యేక పూజలు

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తి స్వామి అమవాస్యను పురస్కరించుకుని సోమవారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు ఆలయాని శుద్ధిచేసి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మెట్లపై దీపాలు వెలిగిస్తు కొబ్బరికాయలు కొడుతూ గోవింద నామస్మరణలతో స్వామి చెంతకు చేరారు. కొండ దిగువన దాసంగాలు పెట్టి వేడుకున్నారు. కొండపైన ఉన్న అలువేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, ఉద్దాల మండపం వద్ద దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ